అనురాగం, ఆప్యాయతలకు ప్రతీక రాఖీ

• బండారు దత్తాత్రేయ

సనత్‌నగర్: అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య అనురాగం, ఆప్యాయతలకు ప్రతీక రాఖీ అని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. సనత్‌నగర్ డివిజన్ బీకేగూడకు చెందిన సీనియర్ బీజేపీ నాయకులు ఆకుల బాలనరసింహ, ఆకుల మహేష్‌కుమార్‌ల నివాసానికి సోమవారం ఆయన విచ్చేసిన సందర్భంలో ఆకుల మహేష్ తల్లి ఆకుల విజయ ఆయనకు రాఖీ కట్టి సోదర బంధాన్ని చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు లింగంపల్లి నర్సింగరావు, దయానంద్, శ్రీశైలంగౌడ్, హృషీకేశ్, శ్రీనివాసరావు, సుమన్, కుషాల్, నరేష్, రాజనీస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతు బజార్‌లో కూరగాయల ధరలు కిలోకు రూపాయల్లో ఈ విధంగా ఉన్నాయి. టమాటా 15, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 25, పచ్చిమిర్చి 40, బజ్జీ మిర్చి 65, క్యాప్సికమ్ 57, పచ్చకాకర 26, పందిరి బీర 23, క్యాబేజీ 19, క్యారెట్ 50, దొండ 23, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 35, గోకరకాయ 25, కీర 21, దోసకాయ 15, బీట్‌రూట్ 35, ఉల్లిగడ్డ 38, ఆలుగడ్డ 38, చామగడ్డ 28, మొరంగడ్డ 45, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 10, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

24న సెయింట్ థెరిస్సా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సనత్‌నగర్: సెయింట్ థెరిస్సా హైస్కూల్‌లో విద్యాభ్యాసం చేసి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు గోల్డెన్ జూబ్లీ వేడుకల నిర్వహణకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు పూర్వ విద్యార్థుల సమ్మేళన వివరాలను ఆహ్వాన కమిటీ మెంబర్ ఆనంద్‌రాజ్ సోమవారం వెల్లడించారు. 1974లో ఒకటో తరగతిలో విద్యాభ్యాసం మొదలుపెట్టడం, 1984లో పదో తరగతి పూర్తి చేయడం జరిగిందని, ఆ బ్యాచ్ నుంచి గత 40 ఏళ్లుగా ఇక్కడ చదివిన పూర్వ విద్యార్థులను గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ఆహ్వానించడం జరుగుతుందన్నారు. ఈ నెల 24న శనివారం ఫిలింనగర్ క్లబ్ హౌస్‌లో ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ వేడుకలు కొనసాగుతాయయని చెప్పారు. వివిధ రకాల వినోదాత్మక కార్యక్రమాలతో ఉల్లాసంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు వివరించారు.

రేపు జాబ్‌మేళా

సనత్‌నగర్: రంగారెడ్డి జిల్లా నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్), డాన్‌బాస్కో దిశ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు దిశ డైరెక్టర్ ఫాదర్ జస్టిన్, కో–ఆర్డినేటర్లు ఐవన్‌వాజ్, కార్తీక్, జిల్లా ఎన్‌సీఎస్ అధికారి విజయ్‌కుమార్‌లు సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఎర్రగడ్డ–మోతీనగర్ రహదారిలోని డాన్ బాస్కో డిగ్రీ కళాశాలలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ జాబ్‌మేళా కొనసాగుతుందన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులను నేరుగా ఇంటర్వ్యూలు చేసి ఎంపిక చేస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్ తదితర కోర్సులు పూర్తి చేసిన జాబ్‌మేళాకు హాజరుకావచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 94940 92219 ఫోన్‌నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

మమతాబెనర్జీ దిష్టిబొమ్మ దహనం



మమతాబెనర్జీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

సనత్‌నగర్: కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనకు సంబంధించి సాక్ష్యాలను ధ్వంసం చేసే కుట్రలను నిరసిస్తూ సోమవారం బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ ఆధ్వర్యంలో సనత్‌నగర్ స్వామి టాకీస్ వద్ద నుంచి మమతాబెనర్జీ దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశారు. ఈ సందర్భంగా మమతాబెనర్జీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ నిందితులకు శిక్ష పడకుండా ఆధారాలను లేకుండా చేసే కుట్రను చేస్తున్నారని ఆరోపించారు. నిందితులను కఠినంగా శిక్షించే వరకు పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ మోహన్, వెంకట సుబ్బారావు, మల్లారెడ్డి, అమ్ము రాంప్రసాద్, ఆనంద్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌కు నివాళి



తులసీనగర్ కమ్యూనిటీ హాల్‌లో సర్వాయి పాపన్నగౌడ్‌కు నివాళులు అర్పిస్తున్న నేతలు

సనత్‌నగర్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి ఉత్సవాలను సోమవారం సనత్‌నగర్ తులసీనగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగాయి. స్థానిక బస్తీ సంక్షేమ సంఘం నేతలు శంకర్‌గౌడ్, భాస్కర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంకయ్యగౌడ్, బోనాల శ్రీనివాస్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, ధనుంజయ్‌గౌడ్, మల్లికార్జున్‌గౌడ్, మల్లయ్యగౌడ్, రాముచారి, విజయ్‌సింగ్, వేణుగోపాల్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రవిగౌడ్, అంజయ్యగౌడ్, సాయిరామ్‌గౌడ్, టిల్లుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సికింద్రాబాద్ : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. లాలాగూడ – మౌలాలి రైల్వేస్టేషన్ల మార్గం మధ్యలోని రైలు పట్టాల పక్కన సోమవారం ఉదయం 6 గంటల సమయంలో సుమారు 30–35 ఏళ్లున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కాగా మృతుడు నలుపు, ఎరుపు రంగుల చెక్స్ పూర్తిచేతుల చొక్కా, నలుపు రంగు ట్రాక్ ప్యాంటు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు.

రక్షా బంధనం.. అనురాగ నందనం

అనుబంధాల కలయిక

ఆత్మీయతకు ప్రతీక

అనుబంధాల కలయిక.. ఆత్మీయతకు ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి వేడుకలు సోమవారం సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో ఘనంగా జరిగాయి. ఆడబిడ్డల రాకతో ప్రతి ఇల్లు సందడిగా మారింది. సుదూర ప్రాంతాల నుంచి అక్కాచెల్లెళ్లు వచ్చి తమ అన్నదమ్ముళ్లకు రాఖీలు కట్టి ప్రేమానురాగాలను చాటుకున్నారు. ఆడబిడ్డల రాకతో ఇళ్లు సందడిగా మారాయి. ఈ సందర్భంగా మిఠాయి దుకాణాలు, ప్రధాన కూడళ్లల్లో మార్కెట్లు కిటకిటలాడాయి. ఎటు చూసినా రాఖీ పండుగ శోభ కనిపించింది. ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలకు ఆయా పార్టీల మహిళా నాయకులు రాఖీలు కట్టి ఆశీర్వదించారు.

– సికింద్రాబాద్/సనత్‌నగర్/ కంటోన్మెంట్ జోన్ బృందం



రాఖీ పౌర్ణమి వేడుకల్లో మాజీ మంత్రి మల్లారెడ్డి



మిలిటరీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆర్మీ జవాన్‌కు రాఖీ కడుతున్న కావ్యారెడ్డి



గవర్నర్ బండారు దత్తాత్రేయకు రాఖీ కడుతున్న తార్నాక కంటెస్టెడ్ కార్పొరేటర్ ఎస్.లక్ష్మీవెంకటేష్‌గౌడ్



ఆర్మీ ఆఫీసర్‌కు మొక్కను అందజేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కడుతున్న డిప్యూటీ మేయర్ ఎం. శ్రీలత శోభన్‌రెడ్డి



మాజీ మంత్రి కేటీఆర్‌కు రాఖీ కడుతున్న నివేదిత



మందకృష్ణ మాదిగకు రాఖీ కడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల విజయ



సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుకు రాఖీ కడుతున్న ఆయన సోదరి శకుంతలమ్మ



కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డికి రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు



బీజేపీ జిల్లా కార్యదర్శి వీరన్నకు రాఖీ కడుతున్న సోదరి ఉపేంద్ర



బీజేపీ నేత బండ చంద్రారెడ్డికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి



అన్నకు రాఖీ కడుతున్న సోదరి



బీఆర్‌ఎస్ నేత నర్సింహకు రాఖీ కట్టిన మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి



కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు రాఖీ కడుతున్న కాంగ్రెస్ మహిళా నాయకురాలు



కాంగ్రెస్ నేత గంట రాజుసాగర్‌కు రాఖీ కడుతున్న సోదరిమణులు

రైల్వే ఇంజినీర్ల సమస్యలపై ఎంపీ కావ్యకు వినతి

అడ్డగుట్ట : సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని దక్షిణ మధ్య రైల్వే ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా రైల్వే ఇంజినీర్ల సమస్యలను వారికి వివరించారు. ఇంజినీర్ల గ్రూప్ 'బి' గెజిటెడ్ సాధనతో పాటు రైల్వేలో సెక్షన్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించిన వారు అదే కేడర్‌లో ఉద్యోగ విరమణ తదితర అంశాలపై విన్నవించామన్నారు. ఈ విషయాన్ని రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చినట్లు సమాచారం. అసోసియేషన్ ప్రతినిధులు పద్మనాభం, లోకేశ్వర్, శ్రీనివాసులు, ఐలయ్య తదితరులున్నారు.



వినతిపత్రం ఇస్తున్న దక్షిణ మధ్య రైల్వే ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి

• బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి.రాజ్‌కుమార్

కాచిగూడ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి.రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. లేని పక్షంలో వేలాది మంది బీసీలతో తెలంగాణ వ్యాప్తంగా ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ప్రతి కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారని ఇప్పుడు మరో 40 కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం నేతలు వంశీకృష్ణ, నిఖిల్, సదానంద్, రాజేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ ఏఐ ఇన్నోవేషన్ కాంక్లేవ్ లోగో ఆవిష్కరణ

కాచిగూడ: అత్యంత ప్రతిష్ఠాత్మకంగా హైదరాబాద్‌లో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్నోవేషన్ సమిట్ లోగోను జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమవారం ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులు జరుగుతున్నాయని అన్నారు. రాబోయే రోజుల్లో కృత్రిమ మేధస్సు విషయంలో పెనుమార్పులు రాబోతున్నాయని అన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీకి హబ్‌గా హైదరాబాద్ నగరం మారాలని ఆకాంక్షించారు. ఏఐ సిటీ కోసం 200 ఎకరాల స్థలం కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమని అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో సెప్టెంబర్ 5, 6వ తేదీల్లో జరుగనున్న గ్లోబల్ సమిట్‌కు ప్రపంచ దేశాల నుంచి ప్రముఖులు రానున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెనోసిస్ ఎండీ డాక్టర్ వినయ్‌కుమార్, చైర్మన్ నాగరాజు ఆదిరెడ్డి, శ్రీనివాస్ గుప్తా, రవి, రమణ, డాక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనపై కొవ్వొత్తుల ర్యాలీ



యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలో కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్ : కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన దారుణ ఘటనకు నిరసనగా సీతాఫల్‌మండిలోని యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూపీహెచ్‌సీ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీలో స్థానిక కార్పొరేటర్ సామల హేమ పాల్గొని మాట్లాడారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణకు ఎన్ని చట్టాలు వచ్చినా అత్యాచారాలు ఆగడం లేదన్నారు. ఈ ఘటనకు కారకులైన వారిని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. అనంతరం కొంత మంది సోదరులు ఆడబిడ్డలకు అండగా ఉండాలని కోరుతూ.. రాఖీ కట్టారు. డాక్టర్లు ప్రత్యూష, లాస్య, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

ప్రోత్సాహంతోనే క్రీడాకారులు రాణిస్తారు

• తలసాని సాయికిరణ్‌యాదవ్

సనత్‌నగర్: క్రీడాకారులకు చేయూతను అందించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలుగుతారని యువనేత తలసాని సాయికిరణ్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద మహిళా లిఫ్టర్ వైష్ణవి మహేష్‌కు తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అక్టోబర్ 4 నుంచి 13వ తేదీ వరకు దక్షిణాఫ్రికాలో జరిగే కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు వైష్ణవిమహేష్ ఎంపికైంది. ఈ పోటీలకు హాజరయ్యేందుకు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న విషయాన్ని తెలుసుకున్న సాయికిరణ్‌యాదవ్ ఈ మేరకు తలసాని ట్రస్ట్ ద్వారా రూ.2 లక్షల ఆర్థిక, సహాయం అందజేశారు. ఈ సందర్భంగా తలసాని సాయికిరణ్ యాదవ్ మాట్లాడుతూ అనేక మంది నైపుణ్యం కలిగిన క్రీడాకారులు ఉన్నప్పటికీ, వారికి సరైన ప్రోత్సాహం లభించకపోవడం వల్ల రాణించలేకపోతున్నారన్నారు. వైష్ణవి మహేష్‌కు గత 4, 5 సంవత్సరాల నుంచి పవర్ లిఫ్టర్‌గా జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ చాటేవిధంగా ప్రోత్సహిస్తూ వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఎప్పటికైనా అంతర్జాతీయ వేదికపై వైష్ణవి మహేష్‌కు తన సత్తా చాటే అవకాశం లభిస్తుందనే పూర్తి నమ్మకం తనకు ఉందన్నారు. రక్షాబంధన్‌ను పురస్కరించుకుని వైష్ణవి సాయికిరణ్‌యాదవ్‌కు రాఖీ కట్టారు. పవర్ లిఫ్టింగ్‌లో తాను అంతర్జాతీయ స్థాయిలో రాణించేవిధంగా తలసాని ట్రస్ట్, తలసాని సాయికిరణ్‌యాదవ్ అందించిన సాయం, ప్రోత్సాహాన్ని ఎన్నటికీ మరువలేనని పవర్ లిఫ్టర్ వైష్ణవి మహేష్ అన్నారు. కామన్వెల్త్ పోటీల్లో మెడల్‌ను సాధిస్తానని ఆమె ధీమా వ్యక్తం చేసింది.



వైష్ణవి మహేష్‌కు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న సాయికిరణ్‌యాదవ్.

తార్నాక హెచ్‌పీబంక్ పెట్రోల్‌లో వాటర్

• కల్తీ పెట్రోల్‌తో మొరాయించిన పలు వాహనాలు
• బంక్ వద్ద ఆందోళన చేపట్టిన వాహనదారులు

లాలాపేట: తార్నాక చౌరస్తాలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో ఆదివారం రాత్రి పెట్రోల్‌లో నీళ్లు వచ్చాయి. ఈ బంక్‌లో పెట్రోలు పోసుకున్న పలు వాహనదారులు కొంతదూరం వెళ్లాక వాహనాలు ఆగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని మెకానిక్‌లకు చూపించగా పెట్రోల్‌లో నీరు కలిసిందని తెలిపారు. ఈ విధంగా దాదాపు 15 మంది వాహనదారులు ఆగ్రహంతో తార్నాక హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్దకు చేరుకుని బంక్ నిర్వాహకులను నిలదీశారు. దీంతో దిగివచ్చిన బంక్ మేనేజర్ మాట్లాడుతూ పెట్రోల్‌లో వాటర్ కలిసినట్లు తాము గుర్తించామని, వాటర్ కలిసిన పెట్రోల్ పోయించుకున్న వాహనాలన్నీ రిపేరు చేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా బాధితులకు మద్దతుగా వచ్చిన స్థానిక బీజేపీ నేతలు వెంకటేష్‌గౌడ్, వీరన్న తదితరులు మాట్లాడుతూ గతంలో పలు మార్లు ఈ బంక్‌లో కల్తీ పెట్రోల్‌లు, మీటర్ ట్యాంపరింగ్‌తో పలు వివాదాలు నెలకొన్నాయన్నారు. ఇక్కడ పెట్రోలుతో వాహనాలు పాడైతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత తూనికలు కొలతల అధికారులు స్పందించి మోసాలకు పాల్పడుతున్న హెచ్‌పీ పెట్రోల్ బంక్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేస్తున్నారు.



తార్నాకలోని హెచ్‌పి పెట్రోల్ బంక్



బంక్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఓ వాహనదారుడు.



ఓ కారు నుంచి తీసిన నీళ్లు కలిసిన పెట్రోల్